ప్రచారరథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- కళాకారుల ప్రచార రథం ప్రారంభం

అలంపూర్, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం కళాకారులు కృషి చేయాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా కళాకారుల ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రచార కార్యక్రమాన్ని, ప్రచార రథాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని, అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోస పూరిత వాగ్దానాలు, రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను తమ ఆటాపాటలతో అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ ఆగడాలను ఎండగడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం : బీఆర్ఎస్

ఇంటింటి ప్రచారం చేస్తున్నబీఆర్ఎస్ నాయకులు

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 24 : నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుం టదామని ఎంపీపీ కృష్ణానాయక్, మండల ఇన్‌చార్జి నందిమల్ల అశోక్ అన్నారు. మండలంలోని వెంకటాంపల్లి, మహ్మదుస్సేన్‌పల్లి గ్రామాల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక గ్యారెంటీల అమలును మరిచి ప్రజలను మోసం చేశారన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీరాములు కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని వదిలి ప్రజల సంక్షేమాని విడిచి కొడుకు బాగుకోసం బీజేపీలో చేరారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి రెండుసార్లు ఎంపీ గెలిచినా అభివృద్ధి చేయకుండా తన స్వలాభాలను చూసుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభివృద్ధికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి నాయకుడు అవసరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు రాళ్లకృష్ణయ్య, జెడ్పీటీసీ సామ్యనాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శుభాకాంక్షలు : ఎమ్మెల్యే బండ్ల

గద్వాల అర్బన్, ఏప్రిల్ 24 : తెలంగాణలో బుధవారం ఇంటర్ బోర్డు ఫలితాలను విడుదల చేసింది. అయితే గద్వాల నియోజకవర్గంలో ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు భ్రవిష్యత్తులో మంచి అత్యున్నత స్థాయికి ఎదిగి ప్రభుత్వ రంగంలో మంచి ఉద్యోగం సాధించి, ఈ ప్రాంతం, మీ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మద్యం దుకాణాలపై దాడులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 24: జిల్లా కేంద్రంలోని పలు మద్యం దుకాణాలపై తూనికలు, కొలతల అధికారులు దాడులు చేపట్టారు. పట్టణంలోని పలు మద్యం దుకాణాల్లో బీర్ల బాటిళ్లు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశామని జిల్లా తూనికల, కొలతల అధికారి సత్యనారాయణ తెలిపారు. జిల్లాలోని జగదాంబ వైన్స్, యువ లిక్కర్ మార్ట్, లిట్రా వైన్స్, బీవీకే వైన్స్, బాలాజీ కూల్‌డ్రింక్స్ దుకాణాల్లో దాడులు చేసి అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. ఒక్కొక్క షాపుకు రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

అదనపు సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

జడ్జి ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఖాజామైనొద్దీన్

గద్వాల అర్బన్, ఏప్రిల్ 24 : గద్వాల అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తిరుమల దేవి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ప్రభాకర్ స్థానంలో ఎవరిని నియమించలేదు. అదనపు సీనియర్ సివిల్ నూతన జడ్జి వచ్చే వరకు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి గంటా కవితకు అదనపు బాధ్యతలు నిర్వహించాల్సిందిగా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆదేశించారు.ఈ సందర్భంగా బదిలీ అయిన జడ్జి ప్రభాకర్‌ను న్యాయవాది ఖాజామైనొద్దీన్‌తోపాటు పలువురు న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందజేసి శుభకాంక్షలు తెలిపారు.

సమిష్టి కృషితో ఆర్ఎస్‌పీని గెలిపిద్దాం

పాన్‌గల్, ఏప్రిల్ 24: గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు సమిష్టి కృషితో పనిచేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధికమెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి, రాష్ట్ర మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులు, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈనెల 26న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాన్‌గల్ మండల పర్యటనకు వస్తున్న సందర్భంగా విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం మండలకేంద్రంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈఎన్నికలో ప్రజలు ఓటుతోనే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి స్వచ్ఛందంగా సభకు వచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 12సీట్లు గెలుస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఎస్టీసెల్ నాయకులు చంద్రశేఖర్ నాయక్, అడ్వకేట్ రవికుమార్, దశరథ్‌నాయుడు, శ్రీనివాస్ నాయుడు, పరమేశ్వర్, గోపాల్‌రెడ్డి, నర్సింహ, తిరుపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడిలో..

పెద్దమందడి, ఏప్రిల్ 24 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చి న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గె లిపించుకుందామని బీఆర్ఎస్ పెద్దమందడి టౌన్ అధ్యక్షుడు సేనాపతి, నాయకులు పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధికూలీల తో బుధవారం మమేకమై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, గతంలో ప దేండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభు త్వం రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 5నెలల్లోపే రాష్ట్రాన్ని ఆ గమాగం చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంద ని, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిద్దామన్నారు. కార్యక్రమంలో మండల అధికారి ప్రతినిధి కురుమూర్తి, కృష్ణారెడ్డి, రాజు, వెంకటన్న పాల్గొన్నారు.

పెద్దమందడిలో ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు



పాన్‌గల్‌లో బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

వాహన తనిఖీల్లో రూ.6,76,920 పట్టివేత

గద్వాల అర్బన్, ఏప్రిల్ 24 : ఎన్నికల్లో భా గంగా జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న తనిఖీల్లో మొత్తం రూ.6,76,920 సీజ్ చేసినట్లు ఎస్సీ రితిరాజ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉండవెల్లి పరిధిలోని పూల్లురు చెక్‌పోస్ట్ వద్ద రూ.3,97,420 , అయిజ మండలంలోని వెంకటాపురంలో రూ.95వేలు, మా నవపాడు మండలలోని రూ.70వేలు, కేటీదొడ్డి మం డలంలోని నందిన్నె చెక్ పోస్ట్ వద్ద రూ.1,14,500 నగదు సీజ్‌చేసి గ్రీవెన్స్ కమిటీ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు.

డిప్లామా కోర్సుల్లో శిక్షణ

గద్వాల/ వనపర్తిటౌన్, ఏప్రిల్ 24 : రాష్ట్రంలోని యువతకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వారు డిప్లామా కోర్సుల్లో మూడేండ్ల శిక్షణ ఇవ్వనున్నట్లు చేనేతజౌళిశాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు 9సీట్లు కేటాయించారని ఇందులో ఈడబ్ల్యూఎస్ కేటగిరి వారికి రిజర్వ్ కేటాయించినట్లు తెలిపారు. ఈ శిక్షణకు పదో తరగతి ఉతీర్ణులై 16జూలై 2024 నాటికి 15-23 ఏండ్ల వయస్సు ఉన్న ఓబీసీ జనరల్ కేటగిరి, 15-25 ఏండ్ల వయస్సు ఉన్న ఎస్సీ, ఎస్టీ కేటగిరి వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు లను జూన్ 10వతేదీ లోగా ప్రిన్సిపాల్ ఎస్‌పీకేఎం ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వెంకటగిరి చిరునామాకు పంపాలన్నారు .ఇతర వివరాలకు చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

టీ-నేతన్న యాప్‌లో నమోదు చేసుకోవాలి..

చేనేత, అనుబంధ కార్మికుల వివరాలను టీ-నేతన్న యాప్‌లో నమోదు చేసుకోవాలని చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య తెలిపారు. నేతన్నకు చేయూత పథకంలో భాగంగా ఇప్పటి వరకు కొంత మంది చేనేత, అనుబంధ కార్మికులు టీ-నేతన్న యాప్‌లో నమోదు అయ్యారని ఇంకా జిల్లాలో 356మంది చేనేత, 1,926మంది అనుబంధ కార్మికులు యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని చేనేత , అనుబంధ కార్మికులందరూ నేతన్నకు చేయూత పథకంలో ఇప్పటివరకు నమోదు చేసుకోని వారు ఈ నెల 30వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలు నమోదు చేసుకునే క్రమంలో ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత క్షేత్రస్థాయి అధికారులను సంప్రదించాలని గోవిందయ్య మంగళవారం ప్రకటనలో కోరారు.

కన్యకా పరమేశ్వరి మాతకు వెండి చీర బహూకరణ

కొత్తకోట,ఏప్రిల్24 : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత, లక్ష్మీమాత, సరస్వతిమాతకు రెండు కేజీల వెండి చీరను బహూకరించినట్లు ఎంపీపీ గుంతమౌనిక తెలిపారు. వెంకటరమణ జ్యూవెలర్స్ యజమాని ఆనంద్‌కుమార్ బ్రదర్స్ వారు అమ్మవారికి వెండి చీరను బహూకరించినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

గద్వాల అర్బన్, ఏప్రిల్ 24 : జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న హుండీని ధ్వంసం చేసి అందులో రూ.13వేల పైగా నగదును అపహరించినట్లు ఆలయ నిర్వాహకుడు తెలిపారు. ఆలయ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- మెడికల్ దుకాణాల ఆకస్మిక తనిఖీ
- మధ్యప్రదేశ్‌కు చెందిన డ్రగ్‌కంపెనీపై కేసు

అయిజ, ఏప్రిల్ 24 : రాష్ట్ర ఔషధ నియంత్రణ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఔషధ నియంత్రణ అధికారి మహ్మద్ రఫీ మెడికల్ దుకాణాల యజమానులను హెచ్చరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ అసిస్టెంట్ ఔషధ నియంత్రణ అధికారి దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని పలు దుకాణాల్లో ఔషధ నియంత్రణ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ స్లిప్ లేకుండా మందులను విక్రయించరాదన్నారు. కాలం చెల్లుతున్న మందులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. డ్రగ్ కంట్రోల్ అనుమతిచ్చిన మందులను దుకాణంలో విక్రయించాలన్నారు. మోతాదుకు మించిన, తగ్గిన మందులను ప్రజలకు అంటకట్టరాదన్నారు. వెంకటసాయి మెడికల్ ఏజెన్సీలో డైక్లోజన్ ఫోర్ట్ ట్యాబ్‌లెట్లు మోతాదులో లోపాలను గుర్తించి 20 స్లిప్పులు సీజ్ చేసినట్లు ఔషధ నియంత్రణ అధికారి తెలిపారు. అలాగే డైక్లోజన్ మందులను సరఫరా చేసిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మందుల కంపెనీపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట ఔషధ నియంత్రణ అధికారి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ దుకాణంలో మందులు, రికార్డులను పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

గ్రామ సమస్యలకు సత్వర పరిష్కారం

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 24 : రాష్ట్రం లో ప్రజలకు ప్రజాపాలన చేరువ చేయాలన్న ఉద్దేశంతో మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యం ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజల వద్దకు పాలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయాన్ని మండల నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీ ఎం సహాయనిధి చెక్కుల మంజూరు కో సం, కల్యాణలక్ష్మి దరఖాస్తులు సైతం ఈ కార్యాలయంలో అందించవచ్చునని సూచించారు. రాష్ట్రంలోని ఖిల్లాఘణపురంలో మొట్టమొదటి ఎమ్మెల్యేక్యాంపు కార్యాల యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలి

మేడికొండలో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో కమలాదేవి

అయిజ, ఏప్రిల్ 24 : పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని సీడీపీవో కమలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని మేడికొండ పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యం నిర్దేశించుకుని విద్యాభ్యాసం చేయాలన్నారు. జీవితంలో గొప్పస్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. బాల్యం పిల్లల హక్కని, పిల్లల హక్కులను కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికులు లేని సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపుల రక్షణకై చైతన్యం చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక సమాచారం అందించేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. 1098,100కు డయల్ చేయాలని సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్ యామిని, ఐసీపీఎస్ ఓఆర్ డబ్ల్యూ ప్రకాష్, సఖీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బీరువాను పగులగొట్టిన దృశ్యం

కేటీదొడ్డి, ఏప్రిల్ 24 : తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగదును అపహరించిన ఘటన బుధవారం మండలంలోని గువ్వలదిన్నె గ్రా మంలో చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం గ్రామానికి చెం దిన హన్మంతురెడ్డి మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లగా..రాత్రి దొంగతనం జరిగింది. ఇంటి యజమాని ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. బీరువా పగులగొట్టి అందులో 1.5 తులా ల బంగారం, రూ.2.40 లక్షల నగదు ఆపహరణకు గురైనట్లు ఫిర్యాదుదారుడు చెప్పినట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటిని పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించారు. అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిర్యాదు చేసిన వెంటనే రశీదు తీసుకోవాలి : ఎస్సీ రితిరాజ్

గద్వాల అర్బన్, ఏప్రిల్ 24 : పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే ఫిర్యాదుదారులు ఆన్‌లైన్‌లో రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సీ రితిరాజ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఎవరైనా తమ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే రిసెప్షన్ సిబ్బంది రశీదు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాదిగహక్కుల దండోరా మద్దతు బీఆర్ఎస్‌కే

వడ్డేపల్లి, ఏప్రిల్ 24 : పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా బీఆర్ఎస్ పార్టీకి మద్దతునిస్తుందని టీఎంహెచ్‌డీ జిల్లా ప్రసిడెంట్ సామెల్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకొని మద్దతు ప్రకటించామని తెలిపారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేశ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను అత్యధిక మె జారిటీతో గెలిపించడానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు స్నేహల త, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, సాయినాథ్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ

పెబ్బేరు, ఏప్రిల్ 24 : ఒకప్పుడు వనపర్తి సంస్థానాన్ని పెబ్బేరు మండలం సూగూరు కేంద్రంగా పరిపాలించే వారు. అప్పట్లో గ్రామంలో రెడ్డిరాజులు నిర్మించిన వీరభద్రస్వామి, జనార్దనస్వామి ఆలయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోడంతో వాటిని పునర్నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బుధవారం రెండు ఆలయ నిర్మాణాలకు భూమిపూజ నిరహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పూజారి రామకృష్ణశర్మ, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, గ్రామస్తులు సితార వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, మాధవుడు, జయన్నశెట్టి, బుచ్చన్న, వేణుగోపాల్ పాల్గొన్నారు.

బీసీ కాలనీకి తాగునీటి సౌకర్యం

గట్టు, ఏప్రిల్ 24 : గట్టులోని బీసీ కాలనీలో తాగునీటి సౌకర్యాన్ని అధికారులు కల్పించారు. చాలాకాలంగా ఆ కాలనీవాసులు తాగునీటి, విద్యుత్ సౌకర్యానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు ఇటీవల అధికారులకు వినతిప్రతం అందజేశారు. ఈ క్రమంలో అధికారులు స్పందించి బీసీ కాలనీలో పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. ఈ పైప్‌లైన్‌కు బీసీ కాలనీ సమీపంలో ఉన్న బోర్‌కు కనెక్షన్‌ను ఇచ్చారు. ఇప్పటికీ తాత్కాలికంగా పది కుళాయిలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా కాలనీవాసులకు నీటిని అందించనున్నారు. ఇదిలా ఉండగా బీసీ కాలనీని ఎంపీవో మహేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణయ్య, పీఎస్‌ఐ శివశంకర్, రవీంద్రగౌడ్ సందర్శించారు. తాగునీటి సరఫరాను పర్యవేక్షించారు.

ఉపాధి పనులు పరిశీలన

పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటయ్య

అయిజ రూరల్, ఏప్రిల్ 24 : మండలంలోని కిష్టాపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీవో వెంకటయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఉదయం వేళల్లోనే వెళ్లాలని సూచించారు. ఉపాధి సిబ్బంది నిర్దేశించిన కొలతలకు పనులు చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తే తగిన కూలీ వస్తుందని తెలిపారు. ఆయనవెంట టీఏ, ఎఫ్ఏ, కూలీలు ఉన్నారు.

లింగమయ్య నామస్మరణతో మార్మోగిన నల్లమల

అచ్చంపేట, ఏప్రిల్ 24: నల్లమల అటవీ లోతట్టు ప్రాం తంలో మూడు రోజులపాటు కొనసాగిన సలేశ్వరం లింగమయ్య జాతర బుధవారం ముగిసింది. చివరి రోజు భక్తు లు అధిక సంఖ్యలో తరలి రావడంతో నల్లమల్ల లింగమ య్య నామస్మరణతో మార్మోమోగింది. చిన్న, పెద్దా, వృద్ధులు కాలి నడకతో లోయలు, గుట్టలు అటవీ ప్రాంతా న్ని లెక్క చేయకుండా తరలి వచ్చి లింగమయ్యను దర్శించుకొని తన్మయత్వం పొందారు. గతంలో సలేశ్వరానికి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చేవారు. ఈసారి ఎండ తీవ్రతతో పాటు జాతరలకు మూడురోజులే అటవీశాఖ అ నుమతులు ఇవ్వడం, పెళ్లిళ్లు అధికంగా ఉడడంతో ఈసారి భక్తుల సంఖ్య తగ్గినట్లు వ్యాపారులు తెలిపారు. కేవలం మూడు రోజులే అవకాశం ఇవ్వడంపై యాత్రికులు, భక్తు లు అసహనం వ్యక్తం చేశారు.

నేటినుంచి ఓపెన్‌స్కూల్ పరీక్షలు

గద్వాలటౌన్, ఏప్రిల్ 24 : ఈనెల 25వ తేదీ నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు నిర్వహించే ఓపెన్ స్కూల్ పరీక్షలకు గానూ అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు జిల్లా కేంద్రంలో 5 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను అధికారులు పర్యవేక్షించారు. బుధవారం నెంబరింగ్ విధానాన్ని పూర్తి చేశారు. అలాగే ఆయా కేంద్రాల్లో పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేకాధికారులను ఏర్పాటు చేశారు.

పదో తరగతిలో..

పరీక్షలకు జిల్లా కేంద్రంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 607మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల పర్యవేక్షణ నిమిత్తం ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు 35మంది, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్స్, అలాగే ఏఎన్ఎంలను నియమించారు.

ఇంటర్‌లో..

ఇంటర్‌లో 859మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికి మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 43మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్స్, ముగ్గురు ఏఎన్ఎంలను నియమించారు. అలాగే సీసీవో ఇద్దరు, డీఆర్‌డీసీ సభ్యులు ఇద్దరిని ఏర్పాటు చేశారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే ప్రాక్టికల్స్ పరీక్షలకు 225మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి 2:30నుంచి సాయంత్రం 5:30గంటల వరకు నిర్వహిస్తారని జరుగుతుందని ఇన్‌చార్జి డీఈవో ఇందిర తెలిపారు. నిర్ణీత సమయానికి గంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అభ్యర్థి వెంట తప్పనిసరి హాల్‌టిక్కెట్‌ను తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థుల ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు.

నెంబరింగ్ వేస్తున్న అధికారులు